క్లుప్తంగా

బంగారమ్మ విగ్రహ ప్రతిష్ట



అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

పార్వతీపురం: మండలంలోని సంగంవలసలో బంగారమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గుంట్రెడ్డి కుటుంబీకులు నిర్మించుకున్న ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా అమ్మవారికి డబ్బు వాయిద్యాలతో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలోని అన్ని వర్గాల వారు పాల్గొన్నారు.

నేడు పెన్షనర్ల సమావేశం

పార్వతీపురంటౌన్: పట్టణంలోని రైతు బజారు వెనుక ఉన్న పెన్షనర్ల భవనంలో సోమవారం ఉదయం 10 గంటలకు పింఛనర్ల సమావేశం నిర్వహించనున్నట్లు పెన్షనర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.గణపతిరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గం నిర్ణయాలను తెలియజేస్తామన్నారు. డిసెంబర్ నెలలో జరగనున్న అంతర్జాతీయ పింఛన్‌దారుల సమావేశం, కార్తీక వన సమారాధనపై చర్చించనున్నట్లు తెలిపారు. పింఛన్‌దారులంతా సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు.

బెల్లం ఊట ధ్వంసం

సాలూరు రూరల్: మండలంలోని నేరళ్లవలస సమీపంలో కోయ కొత్తూరు వద్ద సారా తయారీ కేంద్రంపై రూరల్ ఎస్‌ఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 1000 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. సారా తయారీ, అమ్మకాలపై ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



ప్రసాదరావు

సీతానగరం: రాష్ట్రంలో 104 సంచార వైద్యశాల వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని 104 ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ ప్రసాదరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు జీఓ-7 ప్రకారం వేతనాలు చెల్లించాలని, 104 సర్వీసులను గతంలో మాదిరిగా ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని, డేటా ఎంట్రీ ఆపరేటర్లను పీహెచ్‌సీలో నియమించాలని డిమాండ్ చేశారు. కంపెనీ నుంచి రావాల్సిన బకాయిలు, ఇంక్రిమెంట్లు, పీఎఫ్ చెల్లించేలా ప్రభుత్వమే చర్యలు తీసకోవాలని కోరారు.

ఘనంగా ఓలా నవమి పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

భామిని: కార్తీకమాసంలో కీలకమైన ఓలా నవమి సందర్భంగా వైష్ణవాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బత్తిలి రాధాబృందావన చంద్రస్వామి మఠంలో రాధాకృష్ణులకు విశిష్ట పూజలు చేపట్టారు. ఓలా నవమి సందర్భంగా రాధాదేవి పురుష అలంకరణలో దర్శనమిచ్చారు. అనంతరం భక్తులు ఉసిరి చెట్టు కింద భోజనాలు చేశారు. లివిరి గోపీనాథా రాధాకృష్ణుల సన్నిధిలోనూ ప్రత్యేక పూజలు జరిగాయి.

సమావేశం..



సమావేశమైన యూటీఎఫ్ నాయకులు

సీతంపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న కోరెడ్ల విజయగౌరికి మద్దతుగా యూటీఎఫ్ సంఘ నాయకులు సీతంపేటలో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆ శాఖ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆరిక భాస్కరరావు మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఈనెల 23న ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేయనుందన్నారు. ఈ లిస్టులో చేర్పులు, మార్పులకు అవకాశం ఉంటుందన్నారు. ప్రైవేట్, ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధ్యాపకులు విజయగౌరి విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కుండంగి కృష్ణారావు, కె.ఆనందరావు, బి.పకీరు, పాలక కృష్ణారావు, దండు ప్రకాశరావు పాల్గొన్నారు.

పక్కాగా పశుగణన

- పాడి సంపద లెక్కింపులో పశుసంవర్ధకశాఖ సిబ్బంది బిజీ
- ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ
- 16 రకాల పశువుల లెక్కింపు
- 2025 ఫిబ్రవరికి సర్వే పూర్తిచేయాలని లక్ష్యం

పార్వతీపురంటౌన్:

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయం రంగంలో పశువులు కీలక భాగంగా ఉన్నాయి. వాటిని లెక్కించడం ద్వారా పాడి సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలను ప్రభుత్వం మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు వీలుటుంది. ఇందులో భాగంగానే ప్రతీ ఐదేళ్లకోసారి జాతీయ స్థాయిలో పశుగణన చేపడుతున్నారు. ప్రస్తుతం నవంబరు 1 నుంచి జాతీయ స్థాయిలో పశుగణను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. 2025 ఫిబ్రవరి నెలాఖరులోగా గణన పూర్తిచేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇందు కోసం పశుసంవర్ధక శాఖ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చింది. శిక్షణ పొందిన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పాడి పశువులు, పక్షుల వివరాలను లెక్కించే పనిలో నిమగ్నమయ్యారు.

16 రకాల పశువుల లెక్కింపు

పశుగణనలో భాగంగా ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు, బాతులు, తదితర 16 రకాల జంతువులు, పక్షులను లెక్కిస్తారు. దీనిపై ఇప్పటికే పశుగణన సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. అయితే గతంలో మాదిరిగా కాకుండా గణన చేసే ప్రాంతాల్లోనే ఇంటింటికీ వెళ్లి పరిశీలించి పశుపక్ష్యాదుల వివరాలను ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఆ వివరాలను సూపర్‌వైజర్లు, జిల్లాస్థాయి అధికారులు పరిశీలిస్తున్నారు. పశుగణన పక్కాగా జరిగేలా సిబ్బందికి పలు సూచనలు ఇస్తున్నారు.



వెంకంపేట గ్రామంలో పశుగణనలో పాల్గొన్న అధికారులు

నియోజకవర్గ పరిధిలో సర్వే ఇలా..

పార్వతీపురం నియెజకవర్గ పరిధిలో పశుగణన సర్వే చురుగ్గా జరుగుతోంది. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజరు గ్రామాల్లోని ప్రతీ ఇంటికి వెళ్లి పాడి సంపదను లెక్కకడుతున్నారు. 2025 ఫిబ్రవరి నాటికి సర్వే పూర్తిచేయాలనే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు. పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల్లో 68 వేల ఇళ్లలో సర్వే చేపట్టాల్సి ఉండగా ఇప్పటివరకు 20 శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ప్రతి రోజూ 20 నుంచి 30 ఇళ్లు తిరిగి సర్వే చేస్తున్నారు.

పాడిరైతులకు ఎంతో ఉపయోగం



పాడిరైతుల సంక్షేమానికి పశుగణన ఎంతో అవసరం. పశువులకు ఆహార భద్రత కల్పించడంలోనూ, సంక్రమణ వ్యాధులను నివారించడానికి జీవనోపాధి కల్పించడంలోనూ పశుగణన ఎంతో ఉపయోగపడుతుంది. పక్కాగా పశుగణన లెక్కింపుకు కృషి చేస్తున్నాం.

– బోగి చక్రధర్, పశు వైద్యాధికారి, పార్వతీపురం

ప్రతి ఒక్కరూ సహకరించాలి



గ్రామాల్లో నిర్వహిస్తున్న పశుగణన పక్కాగా జరగాలంటే ప్రజలు సహకరించాలి. పశుగణన ప్రచారంలో భాగంగా కిట్లు, ఐడీ కార్డులు ప్రతీ ఇంటింటికి పోస్టర్లు అంటించే కార్యక్రమాన్ని పూర్తి చేశాం. ప్రజలు పశుగణనకు సహకరించి సరైన సమాచారం ఇవ్వాలి. అప్పుడే ఎటువంటి పొరపాటు జరగకుండా గణన పక్కాగా ఉంటుంది.

– బి.శ్రీనివాసరావు, ఎ.డి, పశుసంవర్ధక శాఖ

గిరిజన విద్యార్థుల మరణాలపై అసెంబ్లీలో చర్చించాలి

- గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్



పార్వతీపురంటౌన్: విశాఖ, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో జరుగుతున్న గిరిజన విద్యార్థుల మరణాలపై అసెంబ్లీలో చర్చించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యా సంవత్సరంలో పదుల సంఖ్యలో గిరిజన విద్యార్థులు మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఏఎన్ఎంల నియామకం జరిగే విధంగా జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన ప్రతీ గిరిజన విద్యార్థి కుటుంబానికి రూ.10 లక్షలకు తగ్గకుండా పరిహారం ఇచ్చేలా మరో జీఓ ఇవ్వాలని కోరారు. గిరిజన విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు డైట్ ఛార్జీలు పెంచాలని, గిరిజన సంక్షేమ విద్యా సంస్థల్లో కుక్, కామిటీ, వాచ్‌మెన్/ఉమెన్, తదితర ఖాళీలను గిరిజన నిరుద్యోగ యువతతో భర్తీ చేయాలని కోరారు. జియమ్మవలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హెడ్ మాస్టర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

నిత్యావసరాల ధరలు, విద్యుత్ చార్జీలు తగ్గించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పార్వతీపురంటౌన్: నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సుందరయ్య భవనంలో జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ప్రజా పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఇందులో జిల్లాలోని ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ చార్జీలు పెరుగుతున్నాయి. నిరుద్యోగం పెరిగింది. నియంతత్వాన్ని అమలు చేయటానికి రాజ్యాంగ విరుద్ధంగా జమిలీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఈ చర్యలను సీపీఎం పార్టీ వ్యతిరేకిస్తోందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, మహిళలపై అత్యాచారాలు, హత్యలు అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ, పట్టణ కార్యదర్శి వెంకటరమణ, ఆర్.శ్రీదేవి, పట్టణ కమిటీ సభ్యులు, సంచన ఉమామహేశ్వరరావు, బంకురు సూరిబాబు, పదాల రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

జియ్యమ్మవలస: మండలంలోని గిరిజన సంక్షేమ వసతి గృహాలను ఎస్ఎఫ్ఐ నాయకులు ఆదివారం సందర్శించారు. ఇటీవల గిరిజన విద్యార్థులు మృతి చెందడంపై ఆరా తీశారు. టీకే జమ్ము వసతి గృహంలో విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత ఉపాధ్యాయులు, వార్డెన్, ప్రధానోపాధ్యాయులు ఎప్పటికప్పుడు భోజనాల నాణ్యత, వసతులను పరిశీలించాలన్నారు. ఆహారం ఎటువంటి కలుషితం కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

సాగునీటి సంఘం ఎన్నికలకు సన్నద్ధం



మాట్లాడుతున్న తహసీల్దార్ ఉమామహేశ్వరరావు

సీతానగరం: మండలంలోని సాగునీటి సంఘాల ఎన్నికలకు అవసరమైన ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని తహసీల్దార్ ఉమామహేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. వెంకటాపురం పంచాయతీ నీలకంఠాపురంలో వీఆర్వో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా పబ్లికేషన్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. మండలంలోని భూమి ఉన్న రైతులంతా సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఓటు వేసేందుక అర్హులుగా పేర్కొన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శనకు ఉంచినట్లు చెప్పారు. అందులో పేర్లు లేని రైతులు ఓటుహక్కు పొందేందుకు పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

ఉపాధి నిధులతో పండ్ల మొక్కల సాగు



సీతారాంపురంలో ఏపుగా పెరిగిన జీడి మొక్కలు

సీతానగరం: ఉపాధిహామీ పథకం కింద అందించే పండ్ల మొక్కలను జాబ్‌కార్డు ఉన్న సన్న, చిన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ భాను కోరారు. మండలంలోని సీతారాంపురం, బక్కుపేట, చిన్నారాయుడుపేట, రేపటివలస, ఆర్.వెంకంపేట గ్రామాల్లో జీడి, మామిడి, సపోటా తోటలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 40 ఎకరాల విస్తీర్ణంలో జీడి, మామిడి తోటలు సాగుచేస్తున్నట్లు చెప్పారు. ఉపాధి వేతనదారులకు జీడి, మామిడి, సపోటా, టేకు, తదితర మొక్కలను అందిస్తున్నామని, వేతనదారులు వాటిని సంరక్షించడం ద్వారా వాటి ఫలసాయాన్ని పొందవచ్చన్నారు. పండ్ల తోటల్లో అంతర పంటలను సాగుచేయడం ద్వారా రైతులు అదనపు లాభాలు పొందవచ్చన్నారు. అలాగే బీటీరోడ్లకు ఇరువైపులా పాదచారులకు నీడనిచ్చేందుకు వీలుగా ఎవెన్యూ ప్లాంటేషన్ వేయడం జరిగిందన్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్ సంరక్షణ బాధ్యతలను వేతనదారుల, పంచాయతీ పాలకులు, పాదుపు సంఘాల సభ్యులు తీసుకోవాలని కోరారు.

జట్టు సేవలు అభినందనీయం



వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: స్వచ్ఛ సుందర పార్వతీపురంలో జట్టు ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ కితాబిచ్చారు. పట్టణంలోని జట్టు ఆశ్రమం నిర్వహిస్తున్న వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని ఆదివారం అయన పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే మన ఆలోచనలు కూడా మంచిగా ఉంటాయని, దాన్ని ఆచరణలో జట్టు ఫౌండేషన్ చూపిస్తున్నదని అన్నారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పారిశుద్ధ్యంపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వేస్ట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమం ద్వారా ఈ ఫౌండేషన్ నూరు శాతం అమలుచేయడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. జట్టు అనుసరిస్తున్న తీరు అభినందనీయమని, ఇటువంటి కార్యక్రమాలు మిగిలిన వారికి స్ఫూర్తిగా నిలుస్తాయని కొనియాడారు. జట్టు ఆశ్రమం వ్యవస్థాపకులు వెనిగొండ్ల పద్మజమ్మ మాట్లాడుతూ స్వచ్ఛ సుందర పార్వతీపురం లక్ష్యంగా తమ ఆశ్రమం పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డి.పారునాయుడు, సీహెచ్ పారినాయుడు, ఎ. కైలాసరావు, ఎ.ఈశ్వరరావు, ఎస్.హేమంత్, పవన్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘన జీవామృతంతో ప్రయోజనం



రైతులతో ఘనజీవామృతం తయారు చేయిస్తున్న భూషణరావు

గుమ్మలక్ష్మీపురం: ఘన జీవామృతం ఎరువుతో జీడి మామిడి చెట్లకు ఎంతో ప్రయోజనమని ప్రకృతి వ్యవసాయ విభాగం గుమ్మలక్ష్మీపురం క్లస్టర్ కోఆర్డినేటర్ కిమిడి భూషణరావు అన్నారు. ఈమేరకు మండలంలోని చెముడుగూడ గ్రామంలోని రైతులచే ఆదివారం జీడిమామిడి తోటల్లో భూసారం పెంపొందింపజేసే ఘన జీవామృతం ఎరువును తయారు చేయించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ ఘనజీవామృతం ఎరువును జీడిమామిడి చెట్ల మొదలల్లో వేసుకోవడం వలన చెట్లకు కావాల్సినంత పోషకాలు లభిస్తుందని, ఫలితంగా దిగుబడి బాగా వస్తుందన్నారు. ఎకరాకు 4 కేజీల ఘనజీవామృతం ఎరువు అవసరం అవుతుందని, సహజసిద్ధంగా లభించే వస్తువులతో తయారు చేసుకోవాల్సి ఉన్నందున పెద్దగా ఖర్చుపెట్టాల్సిన అవసరం ఉండదని, రైతులంతా ఈ విధానాన్ని అవలంబించాలని కోరారు.

పాల సేకరణ ధర పెంచాలి

- ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ
- ఈ నెల 29 చలో విశాఖ డెయిరీ



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ

పార్వతీపురంటౌన్: విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవుపాల సేకరణ ధరను లీటరుకు రూ.3-4 వరకు తగ్గించిందని, ఈ చర్య వలన ఒక రోజుకి పాల ఉత్పత్తిదారులు రూ.20 లక్షలు నష్టపోతున్నారని, ఈ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రాపు సూర్యనారాయణ అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా పాల రైతుల సంఘం కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రైతుకి పాలు ధర గిట్టుబాటు కావడం లేదని, గ్రామాల్లో గతంలోలాగా పచ్చిక బయళ్లు, గడ్డి, దాణా, పశువైద్యం, కృత్రిమ గర్భధారణ అన్నిటికీ ధరలు పెరిగాయన్నారు. పెరిగిన ఖర్చుల నిష్పత్తిలో పాల సేకరణ ధర పెంచాలని, రైతు కోరికను పట్టించుకోని యాజమాన్యం ఇప్పటివరకు ఉన్న ధరను కూడా తగ్గించకపోవడం మరీ అన్యాయమన్నారు.

తగ్గించిన ధరలతోనే పాలు బిల్లులు

తగ్గించిన పాల ధర పెంచమని, పాల రైతులు పెద్ద సంఖ్యలో విశాఖ డెయిరీ ముందు అక్టోబర్ 29న ధర్నా చేశారు. ఆ సమయంలో డెయిరీ జీఎం రైతుల ముందుకు వచ్చి వెంటనే బోర్డు మీటింగ్ వేసి మీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు ఆ హామీలను అమలు చేయలేదు. నేడు తగ్గించిన ధరలతోనే పాలు బిల్లులు వేస్తున్నారని అన్నారు. పాలరైతులు ఐక్యతతో ఈ దురాగతాన్ని ఎదుర్కోవాలి పిలుపునిచ్చారు. విశాఖ డెయిరీకి 7 జిల్లాల నుంచి సుమారు 3.5 లక్షల మంది రైతులు 9 లక్షల లీటర్ల పాలు పోస్తున్నారని, పాల రైతుల చెమట కష్టంతో అభివృద్ధి చెందిన విశాఖ డెయిరీ వేలకోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టుకుందని, కానీ పాడిరైతులకు అభివృద్ధి ఫలాలు దక్కడం లేదని వాపోయారు. డెయిరీ యాజమాన్యం కంపెనీ నిధులను దారిమళ్లిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, గేదెలు సత్యనారాయణ, పాలరైతులు పాల్గొన్నారు.

'ప్రజాపోరు' విజయవంతం చేయండి



బలిజిపేట: గోడపత్రికను విడుదల చేసిన సీపీఎం నాయకులు

బలిజిపేట: నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14 వరకు సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సీపీఎం మండల కమిటీ కార్యదర్శి మన్మథరావు ప్రజాపోరు పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ట్రూఅప్ చార్జీలతో పేద, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతోందని, ప్రభుత్వం ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని, ఉద్యోగుల తొలగింపులు విరమించుకోవాలని, మహిళలు, మైనారిటీలు, దళితులపై దాడులు, అత్యాచారాలు అరికట్టాలని, పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించడంతో పాటు ప్రాజెక్టును పూర్తి చేయాలని, రాజ్యాంగ వ్యతిరేక జమిలీ ఎన్నికల ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజాపోరు కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ నెల 14న తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బి.భానుమూర్తి, బలరాము, సాంబమూర్తి, వేణు, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విహార యాత్రలో జాగ్రత్తలు తప్పనిసరి



సందర్శకులకు సూచనలు చేస్తున్న రూరల్ ఎస్‌ఐ సంతోషి

పార్వతీపురం: పవిత్ర కార్తీక మాసంలో విహార యాత్రలకు వెళ్లే సందర్శకులు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని రూరల్ ఎస్‌ఐ సంతోషి అన్నారు. మండలంలోని అడ్డాపుశీల కాశీ విశ్వేశ్వర స్వామి పరిసర ప్రాంతాల్లో ఆదివారం పిక్నిక్‌కు వచ్చిన సందర్శకులకు పలు సూచనలు చేశారు. పిక్నిక్‌కు వచ్చే పిల్లలను తల్లిదండ్రులు ఒక కంట కనిపెట్టాలన్నారు. పిక్నిక్ స్పాట్‌ల్లో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉండడంతో జేబు దొంగలు కూడా ఉండే అవకాశం ఉందని, పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలను సందర్శించేటప్పుడు ఒంటరిగా కాకుండా సమూహంగా వెళ్తే ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. పిక్నిక్‌ల్లో జూదం పూర్తిగా నిషేధమన్నారు. స్వల్ప జాగ్రత్తలు తీసుకుంటే విహార యాత్ర సుఖాంతం అవుతుందన్నారు. పోలీసులకు సందర్శకులు సహకరించాలని కోరారు.

అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివి



అటవీ అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

పార్వతీపురంటౌన్: విధి నిర్వహణలో అమరులైన అటవీశాఖ అధికారులు, సిబ్బంది త్యాగాలు మరువలేనివని ఎఫ్ఆర్ఓలు రామ్‌నరేష్, మణికంటేష్ అన్నారు. స్థానిక అటవీశాఖ కార్యాలయంలో ఆదివారం అటవీ అమరవీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ సంపద, వన్యప్రాణుల సంరక్షించే క్రమంలో స్మగ్లరు, వన్యప్రాణుల దాడిలో అమరులైన ఫారెస్ట్ సిబ్బందికి నివాళులర్పించారు. వారి త్యాగాలను గుర్తుచేసుకున్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు ఎం.మనోజ్, బీఎం.రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, నిత్య పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంనకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ పర్యవేక్షణలో, అర్చకులు ఎస్.శ్రీనివాసరావు, రఘుశాస్త్రి ఆధ్వర్యంలో జై గురుదత్త హోమ పూజలు, శ్రీచక్ర అర్చన, మహా లింగార్చన, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పార్వతీపురం, వీరఘట్టం, హిరమండలం, కొత్తూరు తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పూజలలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా అవతార్ మెహర్‌బాబా ఆలయ వార్షికోత్సవం

పాలకొండ రూరల్: అవతార్ మెహర్‌బాబా ఆలయ 30వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అగ్నిమాపక కేంద్రం సమీపంలో ఉన్న బాబా మందిర ప్రాంగణంను సుందరంగా తీర్చిదిద్దారు. బాబా ప్రబోధనలు వివరించడంతో పాటు వాటిని అనుసరించడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం సప్తవర్ణ పతాక ఆవిష్కరణ, ప్రేమిక సహవాస్, మోహెరు సంకీర్ణ కార్యక్రమాలతో పాటు తిరువీధి నిర్వహించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను కమిటీ సభ్యులు పి.భాస్కరరావు, కేవీ.రమణ, కె.కేశవరావు పర్యవేక్షించారు.